ఐపీఎల్ ముచ్చట్లు

‘ఇంపాక్ట్’ చూపడం లేదా?

‘‘ఇంపాక్ట్ ప్లేయర్’ రూల్ నాకు నచ్చలేదు. నేను దీనికి పెద్ద అభిమానిని కాను. కొంతమందికి వినోదాన్ని అందించడం కోసం ఇలా చేయడం సరి కాదు. ఈ నిబంధన భారత ఆల్‌రౌండర్ల ఎదుగుదలకు తీవ్ర నష్టం చేకూరుస్తోంది. క్రికెట్ అనేది 11 మందితో ఆడాలి గానీ 12 మందితో కాదు’’ అంటూ టీమ్‌ఇండియా సారథి రోహిత్ శర్మ ఇటీవల చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపుతున్నాయి. సయ్యిద్ ముస్తాక్ అలీ ట్రోఫీ-2023లో ప్రయోగాత్మకంగా పరిచయం చేసిన ఈ నిబంధనను గతేడాదే ఐపీఎల్‌లోనూ తీసుకొచ్చారు. దీని ప్రకారం ప్రతి జట్టూ మ్యాచ్‌కు ముందు ఐదుగురు ‘ఇంపాక్ట్ సబ్’లను ప్రకటించి వారిలో ఒకరిని మ్యాచ్‌లో పరిస్థితులకు అనుగుణంగా తుదిజట్టులో ఉండే ఆటగాళ్ల స్థానంలో ఆడించొచ్చు. దీని వల్ల ఐపీఎల్ జట్లు తమ అవసరానికి తగ్గట్టుగా ఆటగాళ్లను వాడుకుంటున్నాయి.

11 మందితోనే ఆడాలిగా!

ఈ రూల్‌తో క్రికెట్‌లోని ప్రాథమిక సూత్రాలకు తూట్లు పొడుస్తున్నారనేది దీనిపై స్పందిస్తున్న వారి వాదన. ‘ఇంపాక్ట్’ రూల్ వల్ల 12 మందిని ఆడిస్తున్నారనేది ప్రధానమైన విమర్శ కాగా దూబే, వాషింగ్టన్ వంటి ఆల్‌రౌండర్లను సక్రమంగా వినియోగించుకోవడం లేదనేది ప్రధాన ఆందోళనగా ఉంది. ఉదాహరణకు దూబే స్వతహాగా ఆల్‌రౌండర్ అయినా చెన్నై అతడిని ప్యూర్ బ్యాటర్‌గానే వాడుకుంటోంది. రాజస్థాన్ చాహల్‌తో బౌలింగ్ చేయించి బట్లర్‌ను బ్యాటింగ్‌లో ఇంపాక్ట్ సబ్‌గా వాడుతోంది. ముంబై సూర్యకుమార్‌నూ ఇలాగే వాడుకుంటోంది. కొన్ని జట్లు తొలుత బ్యాటింగ్ చేస్తూ త్వరగా కుప్పకూలితే అప్పటికే బ్యాటింగ్ చేసి ఔట్ అయిన ప్లేయర్ స్థానంలో వచ్చిన ఇంపాక్ట్ సబ్ తోనూ బ్యాటింగ్ చేయిస్తున్నాయి. గత సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో పాటు పలు జట్లు ఈ విధానాన్ని పాటించడం విమర్శల పాలైంది. దీనివల్ల 11 మంది కాకుండా 12 మంది బ్యాటింగ్‌కు వచ్చినట్లు అవుతుంది.

మాకూ నచ్చతలె..

రోహిత్‌తో పాటు మరికొంతమంది క్రికెటర్లూ ఈ నిబంధనపై బహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, బౌలర్ ముకేశ్ కుమార్, డేవిడ్ వార్నర్, గుజరాత్ ఆటగాడు డేవిడ్ మిల్లర్ రోహిత్ మాదిరిగానే వ్యాఖ్యానించడం ఈ చర్చకు మరింత ఊతమిచ్చినట్లైంది. ‘ఆల్‌రౌండర్ అవడం వల్ల ఈ రూల్ నాకు నచ్చలేదు. ప్యూర్ బ్యాటర్, బౌలర్‌లకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. ఇదే విషయాన్ని నేను మా టీమ్ మీటింగ్‌లో కూడా ప్రస్తావించాను. ఈ నిబంధన వల్ల నేను బ్యాటింగ్ ఆర్డర్‌లో వెనక్కి రావాల్సి వస్తోంది’ అని అక్షర్ అన్నాడు. ముకేశ్ మాట్లాడుతూ.. ‘అంతర్జాతీయ క్రికెట్‌లో 12 మందితో ఆడరుగా.. మరి ఐపీఎల్‌లో మాత్రం ఎందుకు ఆడాలి..? ఈ రూల్ ఉండటం వల్ల జట్లు 5, 6 వికెట్లు పడ్డా ఇంపాక్ట్ ప్లేయర్‌ను వాడుకుంటూ ప్రయోజనం పొందుతున్నాయి. అలాకాకుండా ఉండాలంటే పిచ్‌లను అయినా మార్చాలి (బౌలింగ్‌కు అనుకూలంగా ఉండేలా) లేదంటే ఈ నిబంధనను అయినా తొలగించాలి’ అని కుండబద్దలు కొట్టాడు. ‘ఈ రూల్ వల్ల జట్లు ఆరుగురు బౌలర్లు, 8 మంది బ్యాటర్లతో బరిలోకి దిగుతున్నట్టుగా ఉంది. ఆల్‌రౌండర్ల పాత్రను ఇది తగ్గిస్తోంది’ అంటూ మిల్లర్ అభిప్రాయపడ్డాడు. ‘ఈ రూల్ వల్ల టీ20 క్రికెట్‌లో ఆల్‌రౌండర్లు కనుమరుగవుతారు’ అని వార్నర్ వ్యాఖ్యానించాడు.

మరి వాళ్లు ఆడుతున్నారుగా..

ఇంపాక్ట్ రూల్‌తో ఆల్‌రౌండర్లకు వచ్చిన నష్టమేమీ లేదనేవాళ్లూ ఉన్నారు. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ మాట్లాడుతూ.. ‘ఇది ఆల్‌రౌండర్లపై ప్రభావం చూపుతుందన్న వాదనలో కొంత నిజమున్నది’అని అన్నాడు. బోర్డు నిర్ణయంపై ఆసక్తి నెలకొన్నది.

మెకానిక్‌కు జాక్‌పాట్

- **డ్రీమ్11 యాప్‌లో కోటిన్నర గెలిచిన బిహార్ వాసి**

పాట్నా: కోటీశ్వరులు కావాలంటే పేరు వెనకాల డిగ్రీలు, ఐదంకెల జీతాలు, అపారమైన మేధాసంపత్తి ఉండాలా..? అక్కర్లేదు! కష్టపడేతత్వంతో పాటు ఆవగింజంత అదృష్టమున్నా లక్ష్మీదేవి మన గుమ్మంలోకి పరుగెత్తుకుంటూ వస్తుందనడానికి ఇది మరో ఉదాహరణ. బీహార్‌లోని అర్రా జిల్లా ఖోడా గ్రామానికి చెందిన దీపు ఓఝా.. 8వ తరగతి మధ్యలోనే ఆపేసి, స్థానికంగా ఉన్న ఓ గ్యారేజీలో మెకానిక్‌గా ఉంటూ అరకొర జీతంతో బతుకుబండి లాగేస్తున్నాడు. కానీ గత ఆదివారం రాత్రి ఐపీఎల్‌లో ముగిసిన కోల్‌కతా-బెంగళూరు మ్యాచ్ తర్వాత అతడి జాతకమే మారిపోయింది. దీపు బ్యాంక్ ఖాతాలో ఉన్నఫళంగా రూ. 1.5 కోట్లు చేరాయి.డీమ్11 యాప్ ఫ్యాంటసీ గేమ్ ఆడిన అతడు రస్సెల్‌ను తన జట్టుకు కెప్టెన్‌గా ఎంచుకోవడంతో ఓఝా పంట పండింది.

మెరిసిన భారత అథ్లెట్లు

దుబాయ్: 21వ ఆసియా అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు పతకాల పంట పండించారు. దుబాయ్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా.. జావెలిన్ త్రోలో 70.29 మీటర్లు విసిరిన దీపాన్షు శర్మ స్వర్ణం గెలవగా 70.03 మీటర్లతో భారత్‌కే చెందిన రోహన్ యాదవ్ రజతం సాధించాడు. పురుషుల 1500 మీటర్ల పరుగు పందేన్ని 3 నిమిషాల 50.85 సెకన్లలోనే పూర్తిచేసిన ప్రియాన్షు రజతం నెగ్గాడు. పురుషుల డిస్కస్ త్రోలో రితిక్ రజతంతో మెరిశాడు.

జమైకా పరుగుల చిరుత, ఒలింపిక్ దిగ్గజం ఉసెన్ బోల్ట్ త్వరలో వెస్టిండీస్- అమెరికా వేదికగా జరుగనున్న టీ20 వరల్డ్ కప్‌నకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యాడు.

హమ్మయ్య

గుజరాత్‌పై ఢిల్లీ ఉత్కంఠ విజయం

ఆఖరి బంతికి గెలుపు ఖరారు

పంత్, అక్షర్ పటేల్ విజృంభణ

సుదర్శన్, మిల్లర్ పోరాటం వృథా

పంత్ (88*)

ఐపీఎల్‌లో మరో పోరు అభిమానులను కట్టిపడేసింది. ఆఖరి బంతి వరకు గెలుపు దోబూచులాడిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్‌దే పైచేయి అయ్యింది. సొంత ఇలాఖాలో సమిష్టి ప్రదర్శన కనబరుస్తూ గుజరాత్‌పై ఢిల్లీ డబుల్ ధమాకా మోగించింది. కెప్టెన్ రిషబ్ పంత్, అక్షర్ పటేల్ అర్ధసెంచరీలతో ఢిల్లీ భారీ స్కోరు అందుకుంది. గుజరాత్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఒకానొక దశలో స్వల్ప స్కోరుకే పరిమితమవుతుందనుకున్న క్యాపిటల్స్..పంత్, పటేల్ బ్యాటింగ్‌తో పోరాడే స్కోరు చేసింది. లక్ష్యఛేదనలో సుదర్శన్ అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, మిల్లర్ కిల్లర్ షాట్లతో ఢిల్లీ గుండెల్లో గుబులు పుట్టించాడు. ఆఖర్లో రషీద్‌ఖాన్ కడదాకా పోరాటం చేసినా..గుజరాత్ గెలుపు తీరాలకు చేరలేకపోగా..హమ్మయ్య గెలిచామంటూ ఢిల్లీ ఊపిరిపీల్చుకుంది.

ఢిల్లీ: వారం రోజుల క్రితం అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌ను వందలోపే పరిమితం చేసి చిత్తుగా ఓడించిన ఢిల్లీ క్యాపిటల్స్.. బుధవారం 224 పరుగులు చేసినా విజయం కోసం ఆఖరి బంతిదాకా వేచి చూడాల్సి వచ్చింది. గుజరాత్‌తో ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో 4 పరుగులతో గెలిచి ఊపిరి పీల్చుకుంది.తొలుత ఢిల్లీ.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 224 పరుగుల భారీ స్కోరుచేసింది. రిషభ్ పంత్ (43 బంతుల్లో 88 నాటౌట్, 5 ఫోర్లు, 8 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా అక్షర్ పటేల్ (43 బంతుల్లో 66, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపులు మెరిపించారు. ఛేదనలో గుజరాత్ టైటాన్స్ కూడా తక్కువ తిన్లేదు. మిల్లర్ (23 బంతుల్లో 55, 6 ఫోర్లు, 3 సిక్సర్లు) ఢిల్లీని భయపెట్టగా సుదర్శన్ (39 బంతుల్లో 65, 7 ఫోర్లు, 2 సిక్సర్లు), రషీద్ ఖాన్ (21 నాటౌట్) రాణించారు. పంత్‌కు ‘మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు దక్కింది.

అక్షర్ అదుర్స్.. పంత్ కేక..

ఢిల్లీ ఇన్నింగ్స్‌కు జేక్ ఫ్రేజర్ (23) మెరుపు ఆరంభాన్నిచ్చినా అతడు ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ఒకే ఓవర్లో ఢిల్లీ ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. నాలుగో స్థానంలో వచ్చిన హోప్ (5) సైతం నిరాశపరిచాడు. 9 ఓవర్లకు ఢిల్లీ చేసిన స్కోరు 68 పరుగులే. కానీ అసలు కథంతా ఆ తర్వాతే మొదలైంది. అప్పటికే క్రీజులో కుదురుకున్న అక్షర్ పటేల్.. పంత్ అండతో గుజరాత్ బౌలర్లను ఆటాడుకున్నాడు. అప్పటిదాకా ఓవర్‌కు ఒక ఫోర్ కొట్టేందుకు తంటాలు పడ్డ ఢిల్లీ.. ఆ తర్వాత బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడటంతో 9 ఓవర్ నుంచి 16 ఓవర్ మధ్యలో ఆ జట్టు 75 పరుగులు రాబట్టింది. అర్ధ సెంచరీ తర్వాత దూకుడుగా ఆడబోయిన అక్షర్.. నూర్ అహ్మద్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. నాలుగో వికెట్‌కు ఈ జోడీ 68 బంతుల్లోనే 113 పరుగులు జోడించింది. కానీ అప్పటికే జోరందుకున్న పంత్.. క్రీజులోకి వచ్చీరాగానే స్టబ్స్ (7 బంతుల్లో 26, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) గుజరాత్ బౌలర్లను ఉతికారేశారు. సాయికిషోర్ 19వ ఓవర్లో 4,6,4,6తో స్టబ్స్ 22 పరుగులు రాబడితే మోహిత్ ఆఖరి ఓవర్లో పంత్.. నాలుగు సిక్సర్లు, ఓ బౌండరీతో 31 పరుగులు పిండుకున్నాడు.

మిల్లర్ కిల్లర్..

225 పరుగుల భారీ ఛేదనలో గుజరాత్.. ఆరంభంలోనే సారథి గిల్ (6) వికెట్‌ను కోల్పోయినా మరో ఓపెనర్ సాహా (39), సుదర్శన్ టైటాన్స్‌ను ఆదుకున్నారు. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 49 బంతుల్లోనే 82 పరుగులు జోడించి పవర్ ప్లేలో వీరవిహారం చేశారు. కుల్దీప్ ఈ జోడీని విడదీశాడు. అర్ధ సెంచరీ పూర్తయ్యాక సాయి.. రసిక్ సలామ్ బౌలింగ్‌లో అక్షర్‌కు క్యాచ్ ఇచ్చాడు. షారుఖ్‌ఖాన్(8), తెవాటియా (4), అజ్మతుల్లా(1)సైతం విఫలమయ్యారు. కానీ డేవిడ్ మిల్లర్ ఢిల్లీని భయపెట్టాడు. నోకియా వేసిన 17వ ఓవర్లో మూడు సిక్సర్లు, ఓ బౌండరీతో 24 పరుగులు రాబట్టి గుజరాత్‌ను పోటీలోకి తెచ్చాడు. అయితే ముకేశ్ 18వ ఓవర్లో మిల్లర్‌ను ఔట్ చేశాడు. 19వ ఓవర్లో రెండు సిక్సర్లతో చెలరేగిన సాయికిషోర్ (13)ను రసిక్ ఆఖరి బంతికి బౌల్డ్ చేశాడు. ఆఖరి ఓవర్లో ఆ జట్టు విజయానికి 19 పరుగులు అవసరం కాగా.. రషీద్ పోరాడినా ముకేశ్ 14 పరుగులే ఇచ్చి ఢిల్లీకి ఉత్కంఠ విజయాన్ని అందించాడు.

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ : 20 ఓవర్లలో 224/4 (పంత్ 88 నాటౌట్, అక్షర్ 66, వారియర్ 3/15, అహ్మద్ 1/36)

గుజరాత్: 20 ఓవర్లలో 220/8 (సాయి 65, మిల్లర్ 55, రసిక్ 3/44, కుల్‌దీప్ 2/29

ఆ ఆరు గంటలు..

పారిస్: మునుపెన్నడూ లేని విధంగా ఒలింపిక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్న పారిస్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆరంభ వేడుకలు జరిగే ఆరుగంటల పాటు పారిస్ నగరంతో పాటు దానికి ఆనుకుని ఉన్న 150 కిలోమీటర్ల ఏరియాను ‘నో ఫ్లై జోన్’గా ప్రకటిస్తున్నట్లు ఎయిర్‌పోర్ట్స్ డి పారిస్ చైర్మన్ అగస్టిన్ డి రొమనెట్ తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే విమానాశ్రయాలకు హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు. ఆరంభ వేడుకలను పారిస్‌లోని సీన్ నది ఒడ్డున నిర్వహించనుండగా సుమారు 3 లక్షల 20 వేల మంది ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జోరు సాగనీ..

నేడు హైదరాబాద్, బెంగళూరు మ్యాచ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) మరో కీలక పోరుకు సిద్ధమైంది. తమ డాషింగ్ బ్యాటింగ్‌తో ప్రత్యర్థులకు దడ పుట్టిస్తున్న హైదరాబాద్..గురువారం రాయ ల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో తలపడనుంది. లీగ్‌లో రికార్డు స్కోర్లతో దుమ్మురేపుతున్న సన్‌రైజర్స్.. సొంత ఇలాఖాలో ఆర్సీబీని మరోమారు అరుసుకోవాలని చూస్తున్నది. ట్రావిస్ హెడ్, అభిషేక్‌శర్మ, క్లాసెన్ భీకరమైన ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు ఆర్సీబీ వరుస ఓటములతో కునారిల్లుతున్నది.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	8	7	1	0.69	14
కోల్‌కతా	7	5	2	1.20	10
హైదరాబాద్	7	5	2	0.91	10
లక్నో	8	5	3	0.14	10
చెన్నై	8	4	4	0.41	8
ఢిల్లీ	9	4	5	-0.38	8
గుజరాత్	9	4	5	-0.97	8
ముంబై	8	3	5	-0.22	6
పంజాబ్	8	2	6	-0.29	4
బెంగళూరు	8	1	7	-1.04	2

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

కొటక్‌పై ఆర్బీఐ కొరడా

బ్యాంక్‌పై ఆంక్షల విధింపు • కొత్త కస్టమర్ల రాక, క్రెడిట్ కార్డుల జారీపై నిషేధం

పదేపదే ఐటీ నిబంధనల ఉల్లంఘనలే కారణం

ముంబై, ఏప్రిల్ 24: దేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన కొటక్ మహీంద్రా బ్యాంక్‌పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) బుధవారం కొరడా ఝుళిపించింది. పదేపదే ఐటీ నిబంధనల ఉల్లంఘనల్ని తీవ్రంగా పరిగణించిన ఆర్బీఐ.. ఇక విసుగెత్తి ఆంక్షల్ని తెచ్చిపెట్టింది. ఇందులో భాగంగానే బ్యాంక్‌కు చెందిన ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ సాధనాలు, మార్గాల ద్వారా నూతన కస్టమర్లను తీసుకోవద్దని, కొత్తగా క్రెడిట్ కార్డులనూ జారీ చేయవద్దంటూ నిషేధం విధించింది. తమ ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని సెంట్రల్ బ్యాంక్ ఓ ప్రకటనలో స్పష్టంగా తెలియజేసింది.

తీవ్ర లోపాలున్నాయ్

కొటక్ మహీంద్రా బ్యాంక్ ఐటీ రిస్క్ మేనేజ్‌మెంట్‌లో తీవ్ర లోపాలను గుర్తించామని, అందుకే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఈ సందర్భంగా ఆర్బీఐ ప్రకటించింది. 2022, 2023ల్లో కొటక్ మహీంద్రా బ్యాంక్ ఐటీ రిస్క్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గవర్నెన్స్ పరిశీలనల్లో ఆందోళనకర అంశాలను ఆర్బీఐ గుర్తించిందని, ఎన్నిసార్లు హెచ్చరించినా నిర్లక్ష్యం వీడలేదని, అందుకే ఈ విధంగా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నది. ఈ నెల 15న కూడా సమస్య వచ్చిందని, బ్యాంక్ కస్టమర్లు తీవ్రంగా అసౌకర్యానికి గురయ్యారని చెప్పింది. తాజా ఆంక్షలపై తమ ముందస్తు అనుమతితో బ్యాంక్ చేపట్టే సమగ్ర ఎక్స్‌టర్నల్ ఆడిట్ అనంతరమే మళ్లీ సమీక్షిస్తామని ఆర్బీఐ తేటతెల్లం చేసింది.

బలోపేతం చేస్తాం: కొటక్

ఆర్బీఐ ఆంక్షల నేపథ్యంలో తమ ఐటీ వ్యవస్థల్ని నూతన సాంకేతికతలతో బలోపేతం చేస్తామని కొటక్ మహీంద్రా బ్యాంక్ తెలిపింది. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించుకొనేందుకు ఆర్బీఐతో కలిసి ముందుకెళ్తామన్నది. కాగా, తాము విధించిన ఆంక్షలు కొత్త కస్టమర్లకే వర్తిస్తాయని, పాత బ్యాంక్ ఖాతాదారులు, క్రెడిట్ కార్డు యూజర్లకు బ్యాంక్ సేవలు యథాతథంగా కొనసాగుతాయని ఆర్బీఐ వెల్లడించింది. ఈ క్రమంలో ఇప్పటికే ఉన్న కస్టమర్లకు ఎప్పట్లాగే అన్ని సేవలు అందుతాయని కొటక్ బ్యాంక్ కూడా స్పష్టం చేసింది.

గతంలో..

ఇక ఇప్పటికే 2020 డిసెంబర్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌పైనా ఇదే తరహాలో ఆర్బీఐ నిషేధం వేసింది. పలుమార్లు సాంకేతిక సమస్యల నేపథ్యంలో కొత్త కార్డుల జారీ, నూతన డిజిటల్ కార్యక్రమాల పరిచయంపై ఆంక్షలు పెట్టింది. ఆ తర్వాత 2022 మార్చిలో వీటిని ఎత్తివేసింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పైనా ఈ మధ్యే కొరడా ఝుళిపించిన సంగతి విదితమే. ఇదిలావుంటే వచ్చే నెల 4న గత ఆర్థిక సంవత్సరానికి (2023-24), చివరి త్రైమాసికానికి (జనవరి-మార్చి)గాను కొటక్ మహీంద్రా బ్యాంక్ ఆడిట్ చేసిన ఏకీకృత, స్టాండలోన్ ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నది.

వాణిజ్య

నాలుగు రోజుల్లో 8 లక్షల కోట్లు

- **పెరిగిన మదుపరుల సంపద**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు లాభాల్లో ముగిశాయి. మెటల్, కమోడిటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలకు దన్నుగా నిలిచాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 114.49 పాయింట్లు అందుకొని 73,852.94 పాయింట్లకు చేరుకున్నది. ఇంట్రాడేలో 74 వేల పాయింట్లకు పైగా చేరుకున్న విషయం తెలిసిందే. మరో సూచీ నిఫ్టీ 34.40 పాయింట్లు అందుకొని 22,402.40 వద్ద నిలిచింది. దీం తో మదుపరుల సంపద రూ.8 లక్షల కోట్లకు పైగా పెరిగింది. బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.8,48,328.9 కోట్లు పెరిగి రూ. 4,01,37,377.21 కోట్లకు చేరుకున్నది. రంగాలవారీగా చూస్తే మెటల్, కమోడిటీస్, ఇండస్ట్రీయల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లు లాభాల్లో ముగియగా.. ఐటీ, టెలికం, టెక్నాలజీ రంగ షేర్లు నష్టపోయాయి.

రిలయన్స్ జ్యువెల్స్ వింధ్య కలెక్షన్లు

ముంబై, ఏప్రిల్ 24: ప్రముఖ ఆభరణాల సంస్థ రిలయన్స్ జ్యువెల్స్..అక్షయ తృతీయ సందర్భంగా వింధ్య కలెక్షన్లను ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో సునీల్ నాయక్ మాట్లాడుతూ.. దేశంలో వైవిధ్యమైన సాంస్కృతిక వారసత్వాన్ని పండుగలా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ అక్షయ తృతీయ రోజున వింధ్య కలెక్షన్లు ప్రారంభించడం జరిగిందన్నారు. ఆభరణాల కొనుగోలు చేయడానికి అక్షయ తృతీయ అనువైన సందర్భమని, ఇది సంపద, శ్రేయస్సుకు ప్రతీకని వ్యాఖ్యానించారు.

వీడియో కాలింగ్‌తో పరిజ్ఞానం రాదు

‘జస్ట్ ఏ మెర్సనరీ?’ పుస్తక ఆవిష్కరణలో దువ్వూరి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు రచించిన ‘జస్ట్ ఏ మెర్సనరీ? నోట్స్ ఫ్రం మై లైఫ్ అండ్ కెరీర్’ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం సంగారెడ్డి జిల్లా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దువ్వూరి మాట్లాడుతూ.. జిల్లాస్థాయి నియామకాలనుంచి దేశ బ్యూరోక్రాటిక్ ఫ్రేమ్ వర్క్ వరకు జరిగిన పరిణామక్రమం, పౌరసేవల్లో లింగ సమానత్వం వంటి పలు ఆసక్తికర అంశాలను సృజించినట్టు తెలిపారు. గత యాభై ఏండ్లలో భారత్‌లో ఎన్నో మార్పులు వచ్చాయని, ముఖ్యంగా అనేక రంగాల్లో దేశం ముందుకు ప్రయాణించిందన్నారు. ఆధునిక సాంకేతిక విజ్ఞానం తోడవడంతో అధికారులు నిర్ణయాలు వేగంగా తీసుకోవడానికి వీలు పడిందన్నారు. బ్యూరోక్రాట్స్ కేవలం వీడియో కాలింగ్స్, సమావేశాలతోనే విషయ పరిజ్ఞానం రాదని, చాలా విషయాలను క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. అన్ని సవ్యంగా ఉంటేనే అధికారులు చక్కటి నిర్ణయాలు తీసుకోగలరన్నారు. తన తల్లికి రాసిన లేఖను పుస్తకంలో అచ్చు వేశారని అన్నారు. ఆ లేఖను డాక్టర్ దువ్వూరి సుబ్బారావు స్వయంగా చదివి వినిపించడం అక్కడున్న వారిని కదిలించింది. ఈ కార్యక్రమంలో కౌటిల్యాలోని విజిటింగ్ ఫ్యాకల్టీ స్మితా శర్మ, ప్రోగ్రామ్ మేనేజర్ శివాంగి శర్మ, కౌటిల్యా స్కూల్ పబ్లిక్ పాలసీ డీన్ సయ్యద్ అక్బరుద్దిన్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. 2005-07 వరకు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి కార్యదర్శిగా పనిచేసిన దువ్వూరి.. 2008 నుంచి 2013 వరకు ఆర్బీఐ గవర్నర్‌గా విధులు నిర్వహించారు.

మే 31కల్లా ఆధార్‌తో పాన్ లింక్ అవ్వాలి

అలాగైతేనే టీడీఎస్ షార్ట్ డిడక్షన్ కోసం చర్యలుండవ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: వచ్చే నెలాఖరుకల్లా ఆధార్‌తో పాన్ అనుసంధానం పూర్తయితే టీడీఎస్ షార్ట్ డిడక్షన్ కోసం పన్ను చెల్లింపుదారులపై ఏ చర్యలూ ఉండబోవని ఆదాయ పన్ను (ఐటీ) శాఖ తెలియజేసింది. ఐటీ నిబంధనల ప్రకారం బయోమెట్రిక్ ఆధార్‌తో పర్మనెంట్ అకౌంట్ నెంబర్ (పాన్) లింక్ అవ్వక పోతే సాధారణంగా వర్తించే రేటుకు రెండింతల టీడీఎస్ మినహాయింపులుంటాయి. కాగా, లావాదేవీ సమయంలో పాన్ ఇన్‌ఆపరేటివ్‌లో ఉన్న ట్యాక్స్‌పేయర్లకు టీడీఎస్/టీసీఎస్ షార్ట్ డిడక్షన్/కలెక్షన్ ఎగవేతకు పాల్పడ్డారన్న నోటీసులు వస్తున్నట్టు సీబీడీటీ తెలిపింది. ఈ మేరకు తమకు పన్ను చెల్లింపుదారుల నుంచి ఫిర్యాదులు అందాయని పేర్కొన్నది. అయితే అలాంటి కేసుల్లో మే 31కల్లా ఆధార్‌తో పాన్ అనుసంధానం కాకపోయినా సాధారణ రేటుకే టీడీఎస్/టీసీఎస్ వసూలుంటుందని సీబీడీటీ స్పష్టం చేసింది. కాగా, 2022 జూన్ 30 వరకు ఆధార్‌తో పాన్ అనుసంధానం ఉచితంగానే జరిగింది. జూలై 1 నుంచి 2023 జూన్ 30 వరకు రూ.1,000 ఆలస్య రుసుముతో అనుమతించారు. అప్పటికీ లింక్ అవ్వని పాన్ జూలై 1 నుంచి ఇన్‌ఆపరేటివ్‌లోకి వెళ్లింది. దీన్ని ఆపరేషన్‌లోకి తేవాలంటే రూ.1,000 ఫైన్ కట్టాల్సిందే. కానీ 30 రోజుల సమయం పడుతుంది. ఆధార్, పాన్ లింక్ కాకపోతే ఐటీ రిఫండ్ ఉండదు. లింక్ చేసుకుంటే రిఫండ్ వస్తుంది. కానీ, ఆలస్యానికి ఐటీ శాఖ నుంచి వడ్డీ రాదు.

హెచ్‌యూఎల్ రూ.24 డివిడెండ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: హిందుస్థాన్ యునిలీవర్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చి త్రైమాసికానికిగాను కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 1.53 శాతం తగ్గి రూ.2,561 కోట్లకు పరిమితమైంది. గతేడాది ఇది రూ.2,601 కోట్లుగా ఉన్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం కూడా రూ.15,375 కోట్ల నుంచి రూ.15,441 కోట్లకు ఎగబాకింది. మరోవైపు, రూపాయి విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.24 తుది డివిడెండ్‌ను ప్రకటించింది.

కంట్రోల్ఎస్ మరో డాటా సెంటర్

హైదరాబాద్‌లో 1.34 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 24: ప్రముఖ టెక్నాలజీ సేవల సంస్థ కంట్రోల్ఎస్..హైదరాబాద్‌లో మరో డాటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే నగరంలో రెండు డాటా సెంటర్లు ఉండగా..గచ్చిబౌలీలో నెలకొల్పుతున్న మూడో సెంటర్ వచ్చే రెండు నుంచి మూడు నెలల్లో అందుబాటులోకి రానున్నది. 1.34 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్ 13 మెగావాట్ల ఐటీ లోడ్ కెపాసిటీతో సంస్థ నెలకొల్పుతున్నది. కృత్రిమ మేధస్సుతో అడ్వాన